సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శనివారం । 12 । జూలై । 2025



పరీక్షించి.. పదును పెట్టి..

విద్యార్థుల స్థాయి అంచనాకు 'బేస్‌లైన్' 'మిడ్‌లైన్' 'ఎండ్‌లైన్' పరీక్షల పద్ధతిని ప్రవేశపెట్టారు.

8లో



విద్యా సామర్థ్యాలు..

గిరిజన విద్యార్థుల సామర్థ్యాలు మెరుగుపర్చాలని ఉపాధ్యాయులకు ఐటీడీఏ పీఓ రాహుల్ సూచించారు.

8లో



వాతావరణం

జిల్లాలో శనివారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. మధ్యాహ్నం తర్వాత అక్కడక్కడా జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

స్వర్ణ కవచధారణలో రామయ్య



కల్యాణ వేడుక నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామివారి దేవస్థానం అంతరాలయంలోని మూలమూర్తులు శుక్రవారం స్వర్ణ కవచధారులై దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. శుక్రవారం సందర్భంగా శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి అమ్మవారికి శుక్రవారం వైభవంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో అర్చకులు అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం ఆలయంలోని మూలవిరాట్‌కు పంచామృతంతో అభిషేకం జరిపారు. పంచహారతులు, నివేదన, నీరాజనం, మంత్రపుష్పం పూజలు, కుంకుమ పూజ, గణపతిహోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న జెడ్పీ సీఈఓ

పెద్దమ్మతల్లి అమ్మవారిని జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి, కొత్తగూడెం కార్పొరేషన్ కమిషనర్ సుజాతలు దర్శించుకున్నారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి శేష వస్త్ర ప్రసాదాలను అందజేశారు.

17న మెడికల్ కళాశాలలో ఇంటర్వ్యూలు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని మెడికల్ కళాశాలలో వైద్యాధికారుల పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ రాజ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలోని 20 విభాగాల్లో ప్రొఫెసర్ పోస్టులు 10, అసోసియేట్ ప్రొఫెసర్ 36, అసిస్టెంట్ ప్రొఫెసర్ 18, ట్యూటర్, సీనియర్ రెసిడెంట్ పోస్టులు 37 ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నెల 17న ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు మెడికల్ కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు అర్హులు హాజరు కావాలని కోరారు.

ఆహార భద్రతా ప్రమాణాలను పాటించాలి



హోటల్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు

కొత్తగూడెం అర్బన్: హోటళ్లు, రెస్టారెంట్లు, ఆహార ఏజెన్సీల నిర్వాహకులు ఆహార భద్రతా నియమాలను, ప్రమాణాలను పాటించాలని జిల్లా డెసిగ్నేటెడ్ ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ డాక్టర్ వాకా మధువరుణ్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ శరత్ ఆదేశించారు. శుక్రవారం కొత్తగూడెం, పాల్వంచ, సారపాక, భద్రాచలం ప్రాంతాల్లోని వివిధ ఆహార ఏజెన్సీలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఫుడ్ సేఫ్టీ అనుమతుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. లైసెన్స్‌లు లేకుండా ఆహార వ్యాపారాలు, మాంసాహార విక్రయాలు, బార్ అండ్ రెస్టారెంట్, వైన్‌షాపులు, మినరల్ వాటర్ ప్లాంట్లు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గోదావరి పరవళ్లు..

రాత్రి 11 గంటలకు 38.8 అడుగుల వరద

- అప్రమత్తమైన జిల్లా ఉన్నతాధికారులు
- పర్ణశాలలో నీట మునిగిన సీతమ్మవారి నారచీరల ప్రాంతం



భద్రాచలం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి నది

భద్రాచలం: భద్రాచలం వద్ద గోదావరి ఉరకలు వేస్తోంది. ఎగువన ఉన్న ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో వరద ప్రవాహం తరలివస్తోంది. గోదావరి నీటి మట్టం శుక్రవారం సాయంత్రం 5 గంటలకు 36.80 అడుగులకు, రాత్రి 11 గంటలకు 38.8 అడుగులకు చేరింది. ఇంకా వరద పెరిగే అవకాశం ఉండటంతో జిల్లా ఉన్నతాధికారులు స్థానిక అధికారులను, సిబ్బందిని అప్రమత్తం చేశారు. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో కాళేశ్వరం, తాలిపేరు ప్రాజెక్టుల నుంచి వరద నీటిని దిగువకు వదులుతున్నారు. దీంతో గురు, శుక్రవారాల్లో గోదావరి ఉధృతి పెరిగింది. గురువారం 23 అడుగులు ఉన్న గోదావరి శుక్రవారం ఉదయం 7 గంటలకు వేగంగా 33.5 అడుగులకు చేరుకుంది. ఉదయం 11 గంటలకు 35, సాయంత్రం 5 గంటలకు 36.8, రాత్రి 11 గంటలకు 38.8 అడుగులకు వచ్చింది. భద్రాచలం వద్ద స్నానఘట్టాలు, దుమ్ముగూడెం మండలం పర్ణశాలలో సీతమ్మ నారచీరల ప్రాంతం నీట మునిగాయి. కాగా భద్రాచలం వద్ద 43 అడుగులకు మొదటి, 48 అడుగులకు రెండో, 53 అడుగులకు మూడో ప్రమాద హెచ్చరికలను జారీ చేస్తారు.

అప్రమత్తం చేసిన అధికారులు

మొదటి ప్రమాద హెచ్చరిక వైపు గోదావరి పరుగులు పెడుతున్న నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారులు అన్ని శాఖల అధికారులను, సిబ్బందిని అప్రమత్తం చేశారు. నది ఒడ్డున ఉన్న స్లూయిస్ పాయింట్ల వద్ద భారీ మోటార్లను సిద్ధం చేశారు. కరకట్టకు ప్రమాదం జరగకుండా ఇసుక బస్తాలను అమర్చారు. హెల్ప్ లైన్ సెంటర్లను ఏర్పాటు చేశారు.



పర్ణశాలలో నీట మునిగిన సీతమ్మవారి నారచీరల ప్రాంతం




కరకట్ట వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ

వరద ఉధృతిని పరిశీలించిన ఎస్పీ

భద్రాచలం అర్బన్: గోదావరిలో నదిలో వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ రోహిత్ రాజు సూచించారు. శుక్రవారం కరకట్ట వద్ద వరదను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. సహాయక చర్యల కోసం ఐదు డీడీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచామని తెలిపారు.

'స్పాంజ్ ఐరన్' తెరుచుకునేనా?

- పాతికేళ్లపాటు నడిచి పదేళ్ల క్రితం మూతపడిన పరిశ్రమ
- ఫ్యాక్టరీని తెరవాలంటూ కేంద్రాన్ని కోరిన రాష్ట్ర ప్రభుత్వం
- సాధ్యాసాధ్యాల పరిశీలనకు నిపుణుల కమిటీ ఏర్పాటుకు హామీ
- కేటీపీఎస్ కాంప్లెక్స్‌లో కొత్త ప్లాంట్ ఏర్పాటుకు సైతం ప్రయత్నాలు



మూతపడిన పాల్వంచలోని స్పాంజ్ ఐరన్ పరిశ్రమ

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: పారిశ్రామిక ప్రాంతమైన పాల్వంచ నడిబొడ్డున ఎన్ఎండీసీ, కేటీపీఎస్‌లలో ఇంచుమించు 900 ఎకరాల స్థలం నిరుపయోగంగా ఉంది. ఈ స్థలాల్లో కొత్త పరిశ్రమల ఏర్పాటుకు ప్రయత్నాలు సాగుతున్నాయి.

దక్షిణాసియాలోనే మొదటిది..

యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద 1980లో దక్షిణాసియాలోనే మొదటిసారిగా కోల్ బేస్డ్ స్పాంజ్ ఐరన్ యూనిట్‌ను పాల్వంచలో నిర్మించారు. మొదటి యూనిట్ విజయవంతం కావడంతో 1985లో రెండో యూనిట్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఈ ప్రాజెక్టు ఆధారంగా 1993లో 7.5 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్లాంట్ నెలకొల్పారు. అనంతరం 1997లో పిగ్ ఐరన్ నుంచి స్పాంజ్ ఐరన్‌ను ఉత్పత్తి చేసే ప్లాంట్ నిర్మించారు. ఇలా దశల వారీగా అభివృద్ధి చెందుతూ వచ్చిన ఈ సంస్థను 2010లో ఎన్ఎండీసీలో విలీనం చేశారు. ఆ తర్వాత నిర్వహణ లోపాల కారణంగా నష్టాల బారిన పడి 2016లో పూర్తిగా మూతపడింది. అనంతరం రాజకీయ ఒత్తిడితో స్పాంజ్ ఐరన్ ఇండియా, పాల్వంచ యూనిట్‌ను 2019 జనవరిలో ఎన్ఎండీసీ సంస్థ తిరిగి ప్రారంభించినా రెండు నెలలకు మించి ఎక్కువ రోజులు నడవలేదు. చివరకు సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రయత్నాలు జరిగినా అవి కూడా ఫలప్రదం కాలేదు.

కేటీపీఎస్‌లో మరో ప్లాంట్ నిర్మించాలని..

పాల్వంచలో కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ తొలి యూనిట్ 1969లో మొదలైంది. ఇటీవల కాలపరిమితి ముగియడంతో నాలుగు స్టేజ్‌లకు సంబంధించిన 720 మెగావాట్ల ప్లాంట్‌ను 2020 పూర్తిగా మూసివేశారు. ఆ ప్లాంట్‌కు సంబంధించిన నిర్మాణాలను గతేడాది కూల్చేశారు. దీంతో ఇక్కడ 400 ఎకరాలకుపైగా స్థలం అందుబాటులోకి వచ్చింది. ఇప్పటికే బొగ్గు, నీటి లభ్యతతో పాటు అన్ని రకాల మౌలిక సదుపాయాలు ఉన్నాయి. దీంతో ఇక్కడ 800 మెగావాట్ల సామర్థ్యంతో సూపర్ క్రిటికల్ లేదా అల్ట్రా సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో ప్లాంట్ నిర్మించాలని గడిచిన ఏడాది కాలంగా డిమాండ్లు వస్తున్నాయి. కొత్తగూడెం ఎమ్మెల్యే కూడా రాష్ట్ర ప్రభుత్వానికి అనేక సార్లు విజ్ఞప్తి చేశారు. దీంతో ప్రస్తుతం రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న థర్మల్ విద్యుత్ ఉత్పత్తి ఎంత? భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఎంత విద్యుత్ ఉత్పత్తి చేయాల్సి ఉంటుందనే అంశాలపై ప్రభుత్వం నివేదిక రూపొందిస్తోంది. ఇందులో కొత్త ప్లాంట్లకు స్థాపన అవసరం ఉందని తేలితే, కేటీపీఎస్ ప్రాంగణంలో ప్లాంట్ ఏర్పాటుకు మార్గం సుగమమం అవుతుంది. ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని ప్రయత్నిస్తున్నారు.

చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు అవకాశం..

పారిశ్రామిక రంగంలో జిల్లాకు వందేళ్ల చరిత్ర ఉన్నా మధ్య, చిన్న తరహా పరిశ్రమలు రావడం లేదు. కేటీపీఎస్, స్పాంజ్ ఐరన్ పరిశ్రమలను పునరుద్ధరించడం సాధ్యంకాని పక్షంలో ఈ పరిశ్రమల స్థలంలో కోల్డ్ రోలింగ్ మిల్ కాంప్లెక్స్, హాట్ రోలింగ్ మిల్, ఎలక్ట్రికల్ రెసిస్టెన్స్ వెల్డెడ్ పైపుల పరిశ్రమ, సెమికండక్టర్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్, ఇథనాల్ ప్లాంట్, బ్యాటరీస్ మాన్యుఫ్యాక్చరింగ్ వంటి పరిశ్రమలు స్థాపించేందుకు అనువైన పరిస్థితులు ఉన్నాయి. దీంతోపాటు వ్యవసాయ రంగానికి అనుబంధంగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు అంశాన్ని పరిగణనలోకి తీసుకోవచ్చు.

మళ్లీ ప్రయత్నాలు

ఏడాది క్రితం ఇటు రాష్ట్రంలో, అటు కేంద్రంలో కొత్త ప్రభుత్వాలు ఏర్పడ్డాక స్పాంజ్ ఐరన్ పరిశ్రమను తెరిపించే ప్రయత్నాలు మళ్లీ మొదలయ్యాయి. 2024 ఫిబ్రవరిలో అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాల్లో స్పాంజ్ ఐరన్ పరిశ్రమను తిరిగి నడిపించాలంటూ కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కోరారు. ఆ తర్వాత కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి, సహాయ మంత్రి భూపతిరాజుల దృష్టికి ఖమ్మం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన తాండ్ర వినోద్‌రావు తీసుకెళ్లారు. తాజాగా రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు విజ్ఞప్తి మేరకు ఈ పరిశ్రమను తిరిగి ప్రారంభించేందుకు గల అవకాశాలు పరిశీలించేందుకు నిపుణుల కమిటీని పంపిస్తానని కేంద్ర పరిశ్రమల మంత్రి కుమారస్వామి హామీ ఇచ్చారు.

398 అడుగులకు కిన్నెరసాని

పాల్వంచరూరల్: ఎగువన కురుస్తున్న వర్షాలకు వరద వచ్చి చేరుతుండటంతో కిన్నెరసాని జలాశయం నీటి మట్టం పెరుగుతోంది. 407 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన రిజర్వాయర్‌లోకి ఎగువ నుంచి 100 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా, శుక్రవారం నీటిమట్టం 398.30 అడుగులకు పెరిగినట్లు ప్రాజెక్ట్ పర్యవేక్షణ ఇంజనీర్ తెలిపారు.



కిన్నెరసాని జలాశయం

తాత్కాలిక పద్ధతులను ప్రోత్సహించాలి



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ జయలక్ష్మి

కొత్తగూడెంఅర్బన్: కుటుంబ నియంత్రణ తాత్కాలిక పద్ధతులను ప్రోత్సహించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి జయలక్ష్మి సూచించారు. శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా కొత్తగూడెంలోని మొర్రేడువాగు బ్రిడ్జి నుంచి రైల్వే స్టేషన్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యకరమైన కుటుంబ నియంత్రణ పద్ధతులను ప్రోత్సహించాలని చెప్పారు. మహిళల పోషక స్థితిని మెరుగుపరచాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు మధువరన్, యు. తేజశ్రీ , ఫైజ్‌మోహియుద్దీన్, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసీలకు మెరుగైన వైద్య సేవలు

భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు, పక్కన కలెక్టర్ జితేష్, ఎస్పీ రోహిత్

చర్ల: ఆదివాసీ గ్రామాల్లో మెరుగైన వైద్య సేవలందించేందుకు మొబైల్ వైద్యశాలలు, ప్రత్యేక అంబులెన్సులు ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు తెలిపారు. మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాల అభివృద్ధి నిధులు రూ.1.50 కోట్లతో మండలంలోని పూసుగుప్పలో ఏర్పాటు చేసిన మొబైల్ వైద్యశాల, అంబులెన్సులను ఆయన కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్ రాజులతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొబైల్ ఆస్పత్రితో పూసుగుప్ప, వద్దిపేట, ఉంజుపల్లి గ్రామాలతోపాటు ఛత్తీస్‌గఢ్‌లోని సరిహద్దు గ్రామాలకు వైద్య సేవలు అందుతాయన్నారు. కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు కూడా మాట్లాడారు. సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ ఎంకే సింగ్, ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, సీఐలు ఏ.రాజువర్మ, సీహెచ్ శ్రీనివాస్, ఈ.శ్రీనివాస్, తహసీల్దార్ ఎం శ్రీనివాస్, ఎంపీడీఓ ఈదయ్య, ఎస్సైలు నర్సిరెడ్డి, కేశవ్, వైద్యాధికారి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందు, చర్ల ఆస్పత్రులకు కాయకల్ప అవార్డులు



ఇల్లెందు ఏరియా ఆస్పత్రి

ఇల్లెందు: ఇల్లెందు, చర్ల ఏరియా ఆస్పత్రులను కాయకల్ప అవార్డు వరించింది. దీంతో ఒక్కో ఆస్పత్రికి రూ. లక్ష చొప్పున నిధులు కేటాయించారు. జిల్లాలోని ప్రభుత్వాస్పత్రులను రెండు నెలల క్రితం కాయకల్ప బృందం సందర్శించి పరిశీలించిన విషయం విదితమే. అవార్డు దక్కటం పట్ల సూపరింటెండెంట్ డాక్టర్ హర్షవర్ధన్, డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబులు హర్షం వ్యక్తం చేశారు. వైద్యులు, సిబ్బంది మెరుగైన వైద్య సేవలు అందిస్తుండటంతోనే అవార్డు వచ్చిందని పేర్కొన్నారు.

ఆధార్ క్యాంపునకు విశేష స్పందన



ఆధార్ క్యాంపునకు వచ్చిన ప్రజలు



బయోమెట్రిక్ నమోదు చేస్తున్న సిబ్బంది

3,772 సమస్యలకు పరిష్కారం

సూపర్‌బజార్(కొత్తగూడెం): కలెక్టరేట్‌లో మూడు రోజులపాటు నిర్వహించిన మెగా ఆధార్ క్యాంపునకు విశేష స్పందన లభించింది. ఈ మేరకు శుక్రవారం రాత్రి కలెక్టర్ జితేష్ వి.పాటిల్ వివరాలు వెల్లడించారు. మొత్తం 3,772 సమస్యలు పరిష్కారమయ్యాయని పేర్కొన్నారు. ఇందులో కొత్త నమోదులు 489, వయోవృద్ధుల సేవలు 45, దివ్యాంగుల నమోదు 12, ట్రాన్స్‌జెండర్ నమోదు 1, బయోమెట్రిక్, ఇతర అప్డేట్లు 602, పుట్టిన తేదీ సవరణలు 5, ఆధార్ రద్దు కేసులు 2, సాధారణ ఎంక్వైరీలు 50, మరికొన్ని ఇతర సమస్యలకు పరిష్కారం లభించిందని వివరించారు. క్యాంపునకు 10 వేల మందికి పైగా హాజరయ్యారని తెలిపారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేనివారు ధ్రువీకరణ పత్రాలు పొంది మీ సేవా కేంద్రాల ద్వారా ఆధార్ నవీకరణ చేసుకోవాలని సూచించారు. మండలాల వారీగా నిర్వహించే మెగా ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకుని ఆధార్ సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు. క్యాంపు విజయవంతానికి సహకరించిన రాష్ట్ర యుఐడీఈ బృందం, ఈ డిస్ట్రిక్ట్ మేనేజరు సైదేశ్వరరావు, రెవెన్యూ, ఐటీ సిబ్బందిని కలెక్టర్ అభినందించారు.

ఆనవాళ్లు కోల్పోతున్న కాలువలు

- నాలుగు దశాబ్దాలుగా మరమ్మతులకు నోచుకోని తాలిపేరు ప్రాజెక్ట్
- శిథిలమైపోతున్న కుడి, ఎడమ ప్రధాన, డిస్ట్రిబ్యూటరీ కాలువలు
- ఐదారేళ్లుగా చివరి భూములకు అందని సాగునీరు
- ప్రాజెక్ట్‌పై నిర్లక్ష్యం వీడాలని కోరుతున్న ఆయకట్టు రైతులు



కుదునూరు సమీపంలో ఆనవాళ్లు కోల్పోయిన తాలిపేరు ప్రాజెక్ట్ ఎడమ కాలువ

చర్ల: తాలిపేరు మధ్యతరహా సాగునీటి ప్రాజెక్ట్ ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోవడంలేదు. ప్రధాన, డిస్ట్రిబ్యూటరీ కాలువలు అధ్వానంగా తయారయ్యాయి. గడిచిన ఐదారేళ్లుగా ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరు అందక చివరి భూముల్లో పంటలు ఎండిపోతున్నాయి. తాలిపేరు ప్రాజెక్ట్‌ను 1985లో నిర్మించారు. ఎడమ కాలువ ద్వారా చర్ల మండలంలోని ఆర్.కొత్తగూడెం, దుమ్ముగూడెం మండలంలోని తూరుబాక (46.46 కిలోమీటర్ల) వరకు సాగునీరు ఇస్తున్నారు. 1992లో కుడి కాలువ 10.44 కిలోమీటర్ల మేర నిర్మించి సాగునీరు అందిస్తున్నారు. రెండు ప్రధాన కాలువలపై 42 డిస్ట్రిబ్యూటరీ కెనాళ్ల ద్వారా ఏటా ఖరీఫ్‌లో అధికారికంగా 24,700 ఎకరాలకు, అనధికారికంగా మరో 15,000 ఎకరాలకు నీటిని విడుదల చేస్తున్నారు.

దశాబ్దాల కాలంగా చిన్నచూపే

తాలిపేరు నిర్మించి 40 ఏళ్లు గడిచినా ప్రాజెక్ట్ అభివృద్ధికి ఏనాడూ పెద్దగా నిధులు కేటాయించలేదు. దీంతో ప్రధాన కాలువలు, డిస్ట్రిబ్యూటరీ కెనాళ్ల మరమ్మతులు పూర్తిస్థాయిలో చేపట్టడంలేదు. అరకొరగా కేటాయించే నిధులను గేట్లు, మోటార్లు, జనరేటర్లు ఇతర మరమ్మతులు, విద్యుత్ సౌకర్యం పునరుద్ధరణ వంటి పనులకు వినియోగిస్తున్నారు. ఏటా అధికారులు తాత్కాలికంగా కాలువల మరమ్మతులు చేస్తూ సాగునీరు అందిస్తున్నారు.

కూలిపోయిన సైడ్ వాల్స్

చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో ప్రధాన కాలువలు పలు చోట్ల కోతకు గురయ్యాయి. సైడ్ వాల్స్ కూలిపోయాయి. వాగులపై నిర్మించిన యూటీలు దెబ్బతిన్నాయి. దానవాయిపేట, బోటిగూడెం గ్రామాల మధ్య టపావాగుపై ఉన్న యూటీ సైడ్ వాల్స్ కూలాయి. కుదునూరు–దేవరాపల్లి గ్రామాల మధ్య జోడిచీలికలవాగుపై ఉన్న యూటీ కూడా కుంగింది. గత ఖరీఫ్ సమయంలో ఈ రెండు చోట్ల యూటీలకు మరమ్మతులు చేపట్టేందుకు కొంత మేర నిధులు మంజూరయ్యాయి. రబీలో సాగునీరు నిలిపివేసి పనులు చేసేందుకు అధికారులు సిద్ధమవగా, ప్రాజెక్టు పరిధిలోని రెండో జోన్‌లో రబీ పంటలకు సాగునీరు ఇవ్వాల్సిందేనని రైతులు పట్టుబట్టారు. దీంతో పనులను నిలిపివేసి యూటీ కుంగిన ప్రాంతంలో ఇసుక బస్తాలను వేసి సాగునీరు విడుదల చేశారు. ఆ తర్వాత మే, జూన్ నెలల్లో పనులు ప్రారంభించాల్సి ఉన్నా పనులు పూర్తయ్యేందుకు సమయం సరిపోదంటూ కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్యం వీడి ప్రాజెక్ట్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

నిర్లక్ష్యం వీడాలి



తాలిపేరు ఆయకట్టు కింద రెండు మండలాల్లోని సుమారు 25 వేల మంది రైతులు పంటలు సాగు చేస్తున్నారు. ప్రాజెక్ట్, కాలువలు దెబ్బతిన్నా మరమ్మతులు చేపట్టకుండా ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి.

– కూరపాటి వీర్రాజు, రైతు, ఆర్.కొత్తగూడెం

నిధులు విడుదల చేయాలి



తాలిపేరు ప్రాజెక్ట్, కాలువలకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలి. మంత్రులు, ఎమ్మెల్యేలు చొరవ తీసుకుని అవసరమయ్యే నిధులను విడుదల చేయాలి. ఏజెన్సీ రైతులను ఆదుకోవాలి.

– దేగల అబ్రహం, రైతు, కుదునూరు

సాగునీటికి ఇబ్బంది రాకుండా చర్యలు



తాలిపేరు ప్రధాన కాలువలకు గండ్లు పడ్డ చోట్ల, యూటీలు కుంగిన చోట్ల తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నాం. ఖరీఫ్ పూర్తికాగానే పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపడతాం.

– ఎస్.ఏ.జానీ, ఈఈ, తాలిపేరు ప్రాజెక్టు

క్లుప్తంగా

నిబంధనల మేరకు పూర్తి చేయాలి



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న హౌజింగ్ పీడీ రవీంద్రనాథ్

పాల్వంచరూరల్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను నిబంధనల ప్రకారం నిర్దేశించిన గడువులోగా పూర్తిచేయాలని హౌజింగ్ పీడీ రవీంద్రనాథ్ ఆదేశించారు. మండలంలోని తోగ్గూడెం గ్రామంలో శుక్రవారం నిర్మాణంలో ఉన్న ఇళ్లను పనిశీలించారు. లబ్ధిదారులకు మాట్లాడారు. ఇంకా నిర్మాణ పనులను ప్రారంభించని లబ్ధిదారులు వారంలోగా ప్రారంభించాలని సూచించారు. నిర్దేశించిన గడువులో ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.విజయభాస్కర్‌రెడ్డి, హౌజింగ్ ఏఈ విశ్వేశ్వరరావు, కార్యదర్శి రవికుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



మునగ ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి

అన్నపురెడ్డిపల్లి(చండ్రుగొండ): మండలంలోని వివిధ గ్రామాల్లో అభివృద్ధి పనులను జిల్లా పరిషత్ సీఈఓ బి.నాగలక్ష్మి శుక్రవారం పరిశీలించారు. వెంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్మాణ దశలో ఉన్న కమ్యూనిటీ శానిటరి కాంప్లెక్స్, రామకృష్ణాపురంలో మునగసాగు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. అబ్బుగూడెం, మర్రిగూడెంలో ఇంకుడుగుంతల నిర్మాణాలు, సైడ్ డ్రెయిన్ పనులకు భూమిపూజ చేశారు. తొలుత ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ శాఖాధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కావూరి మహాలక్ష్మితో పాటు వివిధ శాఖాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కూసుమంచి ఏడీఏ సరితకు పదోన్నతి

భద్రాద్రి జిల్లా ఆత్మ డీపీడీగా నియామకం



బి.సరిత

ఖమ్మంవ్యవసాయం/కూసుమంచి: కూసుమంచి వ్యవసాయ డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీఏ) బి.సరితకు డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి లభించింది. ఈ మేరకు ఆమెను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆత్మ డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ (డీపీడీ)గా నియమిస్తూ గురువారం రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి ఎం.రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో శుక్రవారం సరిత విధుల నుంచి రిలీవ్ అయి భద్రాద్రి జిల్లాలో బాధ్యతలు స్వీకరించారు. ఇదే సమయాన ఖమ్మం రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ ఎం.సతీశ్‌కు కూసుమంచి ఏడీఏగా అదనపు బాధ్యతలు అప్పగించారు. కాగా, సరిత సుదీర్ఘకాలం ఖమ్మం జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో టెక్నికల్ ఏడీఏగా, ఇన్‌చార్జ్ జిల్లా వ్యవసాయాధికారిగా విధులు నిర్వర్తించారు.

ఓసీ విస్తరణకు ప్రజామోదం



మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుమ

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఓసీ విస్తరణలో భాగంగా శుక్రవారం గ్రామసభలో తిర్లాపురం గ్రామస్తులు చేతులు ఎత్తి సుముఖత వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుమ తిర్లాపురం రైతువేదికలో గ్రామసభ నిర్వహించారు. భూ సేకరణలో ఎకరాకు రూ.22.5 లక్షలు, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, చెరువులపై ఆధారపడిన మత్స్యకారులు పొలాలు పోని వారికి ఆర్అండ్ఆర్ అందిస్తామని, నిర్వాసితులకు సింగరేణిలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగం కల్పిస్తామని తెలిపారు. దీంతో గ్రామస్తులు ఆమోదం తెలుపుతూ చేతులు ఎత్తారు. సమావేశంలో తహసీల్దార్ అద్దంకి నరేశ్, జీఎం దుర్గం రాంచందర్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, సింగరేణి అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రేపు రాష్ట్ర స్థాయి సదస్సు

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలో ఈనెల 13న రాష్ట్ర స్థాయి యోగా సదస్సు నిర్వహిస్తున్నట్లు సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మరికంటి వెంకట్ తెలిపారు. ఖమ్మంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాలలో ఆదివారం జరిగే ఈ సదస్సుకు 200 మంది ప్రతినిధులు హాజరవుతారని వెల్లడించారు. ఈ సందర్భంగా కేజీ నుంచి పీజీ వరకు యోగా విద్యను పాఠ్యాంశంగా ప్రవేశపెట్టాలని తీర్మానించనున్నామని తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.17,463

పరీక్షిస్తారు.. పదును పెడతారు..



గత నెల భట్టుపల్లి పాఠశాలలో బేస్‌లైన్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

- విద్యార్థుల పురోగతికి విద్యాశాఖ కొత్త అడుగు
- సామర్థ్యాలను తెలుసుకునేందుకు మూడు దశల్లో పరీక్షలు
- ఏ సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్నారో గుర్తింపు
- అందుకు అనుగుణంగా విద్యాబోధన

కరకగూడెం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచడం, ప్రతి విద్యార్థి సామర్థ్యానికి అనుగుణంగా నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా విద్యాశాఖ ఒక వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సిలబస్ పూర్తి చేయడం, పరీక్షలు నిర్వహించడం అనే సంప్రదాయ పద్ధతులకు స్వస్తి పలికి, విద్యార్థుల అభ్యసన స్థాయిలను శాస్త్రీయంగా అంచనా వేసేందుకు 1 నుంచి 9వ తరగతి విద్యార్థులకు 'బేస్‌లైన్' 'మిడ్‌లైన్' 'ఎండ్‌లైన్' అనే పరీక్షల విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ పరీక్షల ఫలితాలను ప్రత్యేక 'స్కూల్ ఎడ్యుకేషన్' యాప్‌లో నమోదు చేస్తూ డేటా ఆధారిత బోధన ద్వారా విద్యార్థుల్లోని నైపుణ్యాలకు పదును పెట్టే ఈ కార్యక్రమం సర్కార్ బడుల రూపురేఖలను మార్చే దిశగా సాగుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించడానికి వారి పురోగతిని పారదర్శకంగా అంచనా వేయడానికి ఈ సరికొత్త విధానం ఎంతగానో ఉపయోగపడనుంది. జిల్లా వ్యాప్తంగా 953 ప్రాథమిక, 162 ప్రాథమికోన్నత, 124 ఉన్నత పాఠశాలలు ఉండగా 46,754 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

అభ్యసన స్థాయిని నిర్ధారించడం..

ఈ మూడు దశల పరీక్షల ప్రధాన ఉద్దేశం విద్యార్థుల ప్రస్తుత అభ్యసన స్థాయిని నిర్ధారించడం, వారి పురోగతిని ట్రాక్ చేయడం, అందుకు అనుగుణంగా బోధనా పద్ధతులను సర్దుబాటు చేయడం.

- **బేస్‌లైన్ పరీక్షలు:** జూన్ చివరిలో ఈ పరీక్షలను ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులు నిర్వహిస్తారు. ప్రాథమిక అంశాల్లో ఎంతవరకు అవగాహన కలిగి ఉన్నారో ఈ పరీక్షల ద్వారా తెలుస్తుంది.
- **మిడ్‌లైన్ పరీక్షలు:** నవంబర్‌లో ఈ పరీక్షలు నిర్వహిస్తారు. ఉపాధ్యాయులు అందించిన బోధన ఎంతవరకు ఫలించిందో, విద్యార్థులు ఎంత పురోగతి సాధించారో అంచనా వేయవచ్చు.
- **ఎండ్‌లైన్ పరీక్షలు:** విద్యా సంవత్సరం ముగింపులో ఈ పరీక్షలను నిర్వహిస్తారు. విద్యార్థి సాధించిన మొత్తం అభ్యసన స్థాయిని, నైపుణ్యాల పెంపుదలను స్పష్టంగా తెలియజేస్తుంది.
- **పారదర్శకతకు పెద్దపీట**

ఈ పరీక్షల ఫలితాలను ప్రత్యేక 'స్కూల్ ఎడ్యుకేషన్' యాప్‌లో నమోదు చేయడంతో ఫలితాలు పారదర్శకంగా ఉంటాయి. విద్యార్థుల వ్యక్తిగత పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం సులభం అవుతుంది. ఏ విద్యార్థికి ఏ అంశంలో ఎక్కువ శ్రద్ధ అవసరమో గుర్తించడానికి యాప్ డేటా సహాయపడుతుంది.

స్థాయి ఆధారంగా బోధన

పరీక్షల ఫలితాల ఆధారంగా విద్యార్థుల అభ్యసన స్థాయిని బట్టి ఉపాధ్యాయులు తమ బోధనా పద్ధతులను మార్చుకునే అవకాశం ఉంటుంది. ఒక విద్యార్థి గణితంలో వెనుకబడి ఉన్నట్లు బేస్‌లైన్ పరీక్షలో తేలితే ఆ విద్యార్థికి ప్రత్యేక శ్రద్ధతో, విభిన్న బోధనా సామగ్రితో బోధన అందిస్తారు. ఈ సమగ్ర విధానం కేవలం పరీక్షలకే పరిమితం కాకుండా, విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించడానికి ఉపయోగపడనుందని చెబుతున్నారు.

ఏ సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్నానో తెలిసింది



ఈ కొత్త పరీక్షలు మాకు చాలా ఉపయోగపడుతున్నాయి. బేస్‌లైన్ పరీక్ష రాసిన తర్వాత నేను ఏ సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్నానో తెలిసింది. టీచర్లు కూడా మాకు అర్థం కాని విషయాలను మళ్లీ చెబుతున్నారు. పరీక్షలు పెట్టడం వల్ల మేము ఎక్కడ ఉన్నామో తెలుస్తోంది. బాగా చదువుకోవడానికి ప్రోత్సాహంగా ఉంది.

–పి.సుశాంత్, 9వ తరగతి, భట్టుపల్లి జెడ్పీహెచ్ఎస్

భవిష్యత్‌కు బలమైన పునాది..



రాష్ట్ర విద్యాశాఖ ప్రవేశపెట్టిన ఈ పరీక్షల విధానం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచడంలో విప్లవాత్మక మార్పు తీసుకువస్తుంది. ప్రతి విద్యార్థి అభ్యసన స్థాయిని కచ్చితంగా అంచనా వేసి వారి అవసరాలకు అనుగుణంగా బోధనను అందించడానికి ఇది మాకు సహాయపడుతుంది. ఇది విద్యార్థుల భవిష్యత్‌కు బలమైన పునాది వేస్తుంది.

–నాగరాజశేఖర్, జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్

విద్యా సామర్థ్యాలు పెంపొందించేలా కృషి

ఐటీడీఏ పీఓ రాహుల్



మాట్లాడుతున్న పీఓ రాహుల్

భద్రాచలంటౌన్: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థుల సామర్థ్యాలు ప్రతీ సబ్జెక్ట్‌లో మెరుగుపడేలా ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలని భద్రాచలం ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సూచించారు. భద్రాచలంలోని బీఈడీ కళాశాలలో ఉమ్మడి జిల్లాలోని పాఠశాలల హెచ్‌ఎంలతో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ.. సబ్జెక్ట్ టీచర్లు ఉద్దీపకం వర్క్‌బుక్‌ల ద్వారా విద్యార్థులకు బోధన సాగించాలని తెలిపారు. పాఠశాలలకు సరఫరా చేసిన నోటుబుక్స్, టెక్ట్స్ బుక్స్, యూనిఫామ్‌లు వెంటనే అందించాలని, నూతన మెనూ ప్రకారం భోజనం సమకూర్చాలని సూచించారు. వర్షాకాలం నేపథ్యాన పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూనే బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఆర్‌ఓ ప్లాంట్లు లేనిచోట వేడి చేసిన నీటినే విద్యార్థులకు అందించాలని పీఓ సూచించారు. సమావేశంలో డీడీలు మణెమ్మ, విజయలక్ష్మి, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ వీరునాయక్, ఏసీఎంఓలు రాములు, రమేశ్, ఏటీడీఓలు అశోక్‌కుమార్, చంద్రమోహన్, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

జామాయిల్ మొక్కల చిగుర్లు చోరీ?



ప్లాంటేషన్‌లో కోసిన జామాయిల్ చిగుర్లు



చిగుర్ల తరలింపునకు సిద్ధంగా ఉంచిన వాహనం

ములకలపల్లి: జామాయిల్ మొక్కల లేలేత చిగుర్లు చోరీకి గురవుతున్నాయి. మొక్కల పునరుత్పత్తి చేసే చాంబర్లలో వీటికి భారీగా డిమాండ్ ఉండడంతో తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ (టీఎస్ఎఫ్‌డీసీ) ఆధ్వర్యంలో పెంచుతున్న జామాయిల్ తోటల్లోని చిగుర్లు అక్రమార్కుల పాలవుతున్నాయి. స్థానిక సిబ్బంది సహకారంతోనే ఈ దందా సాగుతున్నట్లు ప్రచారం సాగుతోంది. మండలంలోని జిన్నెలగూడెం ప్లాంటేషన్ పరిధిలో సుమారు 50 హెక్టార్లలోని జామాయిల్ తోటలను రెండు నెలల కిందట నరికేశారు, విస్తారంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఈ ప్రదేశంలో జామాయిల్ మొక్కలు లేలేత చిగుర్లతో పెరుగుతున్నాయి. చిగుర్ల ద్వారా జామాయిల్ మొక్కల పునరుత్పత్తి చేపట్టనున్న తరుణంలో జామాయిల్ చాంబర్లలో వీటికి భారీగా డిమాండ్ ఏర్పడింది. దీంతో పలువురు ఇక్కడి చిగుర్లపై దృష్టి సారించారు. చిగుర్లను చోరీ చేసి వాహనాల్లో చాంబర్లకు తరలిస్తున్నారు. జిన్నెలగూడెం ప్లాంటేషన్ పరిధిలో సిబ్బంది సహకారంతో కొంతకాలంగా ఈ దందా సాగుతున్నట్లు తెలిసింది. ఈ విషయమై ప్లాంటేషన్ మేనేజర్ సునీతను వివరణ కోరగా.. క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి, చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పని చేసే ప్రతీ కూలీకి నగదు ఇవ్వాలి



పనుల వివరాలను వివరిస్తున్న తనిఖీ బృందం

గుండాల: గ్రామీణ ఉపాధి హామీ పనులు చేసిన ప్రతీ ఒక్క కూలీకి డబ్బులు చెల్లించాలని, పనులు జరిగే ప్రదేశాలకు సిబ్బంది వెళ్లాలని అడిషనల్ డీఆర్‌డీఓ రవి అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో 16వ విడత ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఏడాది కాలంగా నిర్వహించిన ఉపాధి హామీ పనుల వివరాలను తనిఖీ బృందం వెల్లడించింది. అన్ని గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో రిజిస్టర్లలో తప్పులు, మెయింటెనెన్స్ లేకపోవడం, కూలీలకు డబ్బులు చెల్లించడంలో జాప్యం ఏర్పడడం గుర్తించామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ పనుల్లో భాగంగా పలువురి నుంచి రూ.14,610 రికవరీతో పాటు, నిర్లక్ష్యం కారణంగా రూ.11 వేలు జరిమానా విధించామని తెలిపారు. పనులు జరిగే ప్రాంతాలకు వెళ్లి ఎప్పటికప్పుడు మస్టర్లు వేయడం, పనులను పర్యవేక్షించడం, కంప్యూటర్లలో నమోదు చేస్తే తప్పులు జరిగే ప్రసక్తి ఉండదని చెప్పారు. అవినీతికి పాల్పడినా, అలసత్వం వహించినా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. సమావేశంలో డీవీఓ రమణ, ఎంపీడీఓ బాలరాజు, ఏపీఓ అనూష, ఆర్ఆర్‌పీ సుశీల, ఎంపీఓ శ్యాంసుందర్, ఏపీఓ రవితేజ, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా ఫైనాన్స్ ఎకౌంట్ ఆఫీసర్‌గా టేకులపల్లి ఎంఈఓ



జగన్‌నాయక్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

టేకులపల్లి: బోడు కాంప్లెక్స్ హెచ్‌ఎం, టేకులపల్లి ఎంఈఓ అజ్మీర జగన్‌నాయక్ జిల్లా విద్యాశాఖలో ఫైనాన్స్ అకౌంట్ ఆఫీసర్‌గా నియమితులయ్యారు. శుక్రవారం బోడు ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ పరిధిలోని 12 పాఠశాలల ఉపాధ్యాయులు ఆయనకు సత్కారం చేశారు. కార్యక్రమంలో హథిరామ్‌నాయక్, బాలాజీ, భాస్కర్‌రావు, రామస్వామి, రాంబాబు, తిరుపతి, స్వర్ణలత, భానుప్రియ, సీతారాములు పాల్గొన్నారు.

చెరువులో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



మృతదేహాన్ని తీసుకొస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం

మణుగూరుటౌన్: దేశవ్యాప్త సమ్మె నేపథ్యంలో ఈ నెల 9న మండలంలోని కూనవరం జీపీ రేగులగండి చెరువు వద్దకు వెళ్లిన కార్మికుల బృందంలో ఓసీ ఈపీ ఆపరేటర్ సుంకరి శ్రీనివాస్ (36) గల్లంతైన విషయం విదితమే. శుక్రవారం ఉదయం ఆయన మృతదేహం లభ్యమైంది. భద్రాచలం నుంచి వచ్చిన ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం, మణుగూరు ఫైర్ రెస్క్యూ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడికి ఇద్దరు పిల్లలు, భార్య ఉండగా, ఇటీవల గోదావరిఖని నుంచి మణుగూరు బదిలీపై వచ్చాడు. కాగా, మృతదేహాన్ని చూసిన కుటుంబ సభ్యులు, తోటి కార్మికులు కన్నీరుమున్నీరయ్యారు.

యువకులు, ఎస్పీఎఫ్ కానిస్టేబుళ్ల మధ్య ఘర్షణ

పాల్వంచరూరల్: స్థానిక యువకులు, ఎస్పీఎఫ్ (స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్) కానిస్టేబుళ్లకు మధ్య శుక్రవారం రాత్రి ఘర్షణ చోటుచేసుకుంది. మండలంలోని కిన్నెరసానిలోని ఓ దుకాణంలో ఆఫ్రిద్, సాయి, మరో ఇద్దరూ యువకులు కలిసి మాట్లాడుకుంటున్నారు. అదే సమయంలో ఎస్పీఎఫ్ కానిస్టేబుళ్లు నలుగురు వచ్చి యువకులను తనిఖీ చేశారు. గంజాయి తాగుతున్నారని తెలిసిందని, యువకుల బట్టలు విప్పి మరీ తనిఖీ చేశారు. ఈ క్రమంలో యువకులు, కానిస్టేబుళ్ల మధ్య ఘర్షణ జరిగింది. కానిస్టేబుళ్లు షేక్ ఆఫ్రీద్, పెద్దబోయిన సాయిని కొట్టడంతో స్థానికులు తిరగబడ్డారు. దీంతో కానిస్టేబుళ్లు అక్కడి నుంచి వెళ్లిపోయారు. దెబ్బలు తిన్న యువకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై ఏఎస్‌ఐ సుధాకర్‌ను వివరణ కోరగా ఎస్పీఎఫ్ కానిస్టేబుళ్లకు, స్థానిక యువకులకు మధ్య వాగ్వాదం జరిగినట్లు సమాచారం అందిందని, ఈ విషయాన్ని ఎస్‌ఐ సురేశ్ దృష్టికి తీసుకువెళ్లగా శనివారం విచారణ జరుపనున్నట్లు ఎస్‌ఐ చెప్పారని.. ఏఎస్‌ఐ సుధాకర్ తెలిపారు.


రోడ్డు ప్రమాద బాధితురాలికి శస్త్రచికిత్స



శస్త్రచికిత్స నిర్వహిస్తున్న వైద్యులు

కొత్తగూడెంఅర్బన్: అన్నపురెడ్డిపల్లిలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మాధవికి కొత్తగూడెం జిల్లా ఆస్పత్రిలో శస్త్రచికిత్స నిర్వహించి మోకాలు పైభాగం వరకు తొలగించారు. మాధవికి ఎలాంటి ప్రాణహాని లేదని వైద్యులు నిర్ధారించారు. శస్త్రచికిత్సలో ఆర్థోపెడిక్ సర్జన్ సుజన్, సీనియర్ రెసిడెంట్స్ డాక్టర్ చంద్రహాస్, కన్నన్, అనస్తీషియా డాక్టర్ రమేశ్, ఓటీ సిబ్బంది అరుణ, దుర్గా, అసిస్టెంట్లు ఆది, హైమా పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వృద్ధురాలి మృతి



వెంకటమ్మ (ఫైల్)

దుమ్ముగూడెం: మండలంలోని నర్సాపురం గ్రామం ఎస్సీకాలనీలో టాటా ఏస్ వాహనం ఢీకొని కనుకు వెంకటమ్మ (60) మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. భద్రాచలంలోని ఓ శీతల పానీయానికి చెందిన టాటా ఏస్ వాహనం నర్సాపురం గ్రామంలో కూల్‌డ్రింక్స్ అన్‌లోడ్ చేసి రివర్స్ చేస్తుండగా రోడ్డుపై నడిచివస్తున్న వెంకటమ్మను ఢీకొట్టింది. తీవ్ర గాయాల పాలైన వెంకటమ్మను నర్సాపురం వైద్యశాలకు.. అక్కడి నుంచి భద్రాచలం తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందింది. మృతదేహాన్ని భద్రాచలం ఏరియా వైద్యశాలలో ఉంచగా బంధువులు వైద్యశాల ఎదుట ఆందోళన చేపట్టారు. ఎస్‌ఐ గణేశ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రేపల్లెవాడ రైతువేదికలో టీవీ చోరీ



రైతువేదిక వద్ద విచారిస్తున్న పోలీసులు, వ్యవసాయశాఖ అధికారులు

ఇల్లెందురూరల్: మండలంలోని రేపల్లెవాడ రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్‌కు వినియోగించే టీవీ చోరీకి గురైంది. శుక్రవారం రైతువేదికలో టీవీ కనిపించక పోవడంతో గ్రామ పంచాయతీ సిబ్బంది వ్యవసాయశాఖ అధికారులకు సమాచారం అందించారు. పరిశీలించిన ఏడీఏ లాల్‌చంద్, ఏఓ సతీశ్ చోరీ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే రైతువేదిక వద్దకు చేరుకున్న పోలీసులు విచారణ ప్రారంభించారు. గ్రామంలోని జర్పుల సాగర్ మూడు రోజుల కిందట టీవీ భుజంపై పెట్టుకొని ఇల్లెందు వైపుగా నడుచుకుంటూ వెళ్లడాన్ని చూశామని పలువురు రైతులు చెప్పడంతో అతని ఇంటి వద్దకు వెళ్లి విచారించారు. పోలీసులతోపాటు గ్రామస్తులు సైతం హెచ్చరించడంతో తానే చోరీ చేసినట్లు సాగర్ అంగీకరించాడు. సుభాష్‌నగర్ జీపీలో విక్రయించానని చెప్పడంతో పోలీసులు సాగర్‌ను అదుపులోకి తీసుకున్నారు. వెంటనే టీవీని తెచ్చి పోలీస్ స్టేషన్‌లో ఇవ్వాలని కొనుగోలు చేసిన వ్యక్తిని పోలీసులు ఆదేశించారు.

ఎమ్మెల్యే మేనకోడలు ఆత్మహత్య

దమ్మపేట: అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మేనకోడలు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని గండుగులపల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎమ్మెల్యే జారే సోదరి ముత్తమ్మ, తన భర్త కుర్సం వీరభద్రంతో కలసి గండుగులపల్లిలో ఉంటోంది. వీరికి ఇద్దరు కుమార్తెలుండగా పెద్ద కుమార్తె వెంకటరమణ(26) బీఈడీ పూర్తి చేసి, ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తోంది. శుక్రవారం కుటుంబ సభ్యులు వ్యవసాయ పనులకు వెళ్లగా.. ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చి చూసేసరికి అప్పటికే మృతి చెందింది. ఉద్యోగ ప్రయత్నాలు ఫలించని కారణంగా డిప్రెషన్‌తో ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని బంధువులు చెబుతున్నారు.

పంట చేనులోనే పోయిన ప్రాణం

వేంసూరు: వానాకాలం సాగు పనులకు ఉపక్రమించిన రైతు పొలాన్ని సిద్ధం చేసే క్రమాన విద్యుదాఘాతంతో మృత్యువాత పడ్డాడు. వేంసూరు మండలం చౌడవరం తండా సమీపాన శుక్రవారం ఈ ప్రమాదం జరిగింది. వేంసూరు కమ్మబజార్‌కు చెందిన చల్లగుండ్ల నాగార్జున(55) శుక్రవారం ఉదయం చౌడవరం తండా సమీపంలో పొలంలో దుక్కి దున్నించేందుకు వెళ్లాడు. అయితే, మధ్యలో విద్యుత్ తీగ అడ్డుగా ఉందని తొలగించే క్రమాన షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. రైతు నాగార్జునకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా, రెండు రోజుల క్రితం వేంసూరు కమ్మబజార్‌కు చెందిన రావి నాగేశ్వరరావు మృతి చెందగా, ప్రస్తుతం నాగార్జున మృతితో స్థానికంగా విషాదం అలుముకుంది.

మూడు ఇళ్లలో చోరీకి యత్నం

మధిర: ఒకేరోజు రాత్రి మూడు ఇళ్లలో దుండగులు చోరీకి యత్నించగా ఒక స్కూటీ ఎత్తుకెళ్లారు. మధిర మున్సిపల్ పరిధి అంబారుపేటకు చెందిన కర్నాటి కోటి, మణిభూషణం కుటుంబాలు వ్యాపార నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లాయి. దీంతో గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు వారి ఇళ్ల తాళాలు పగలగొట్టినా విలువైన వస్తువులేమీ లభించక బీరువాల్లో దుస్తులను చిందరవందర చేసి వెళ్లిపోయారని సమాచారం. సమీపంలోని కర్నాటి పెద్ద బుజ్జి ఇంట్లో నిద్రిస్తుండగా ఆరుబయట నిలిపిన స్కూటీని ఎత్తుకెళ్లారు.

భర్త వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

కామేపల్లి: మండలంలోని బాసిత్‌నగర్‌కు చెందిన తేజావత్ మౌనికకు ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా తిరువూరుకు చెందిన సపావట్ కృష్ణప్రసాద్‌కు నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. మద్యానికి బానిసైన ఆయన కృష్ణప్రసాద్ మౌనికను అనుమానిస్తుండడంతో శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయాన ఆత్మహత్య చేసుకుంది. ఆమెకు మూడేండ్ల కుమారుడు ఉన్నాడు. మౌనిక తండ్రి వీరన్న ఫిర్యాదుతో ఆమె భర్త, అత్త, ఆడబిడ్డపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.